# పిత్రార్జితం

ఒకరోజు పొద్దున్నే లేచేటప్పటికి గోపీకి ముసలివాణ్నయ్యాననే భ్రాంతి కలిగినది. అప్పటినుంచి అతనికి ప్రపంచంమీద విరక్తిపుట్టింది. ఏ పని చెయ్యబోయినా, "ఎందుకుచెయ్యాలి?" అనే ప్రశ్న పెద్దపెద్ద అక్షరాలతో కనబడుతూవుండేది. ఏదన్నా ఒక పని చెయ్యటానికి వుపక్రమించి, ఆ పని చేస్తున్నందుకుగాను తన్నుచూచి తానే నవ్వుకుంటూ వుండేవాడు. ఎవరన్నావచ్చి "జపాన్ మనదేశంమీదకు దాడిచేసేట్టుంది" అంటే "చేస్తేయేం" అనబుద్ధయ్యేది.

అతని ఈఅవస్థలో ఒక ముసలాయన తనకోసం కంగారుగా రావటం చూశాడు గోపీ అప్పుడే పొలికట్టతో పశువుల కొట్టం బాగుచేసి, గేదెముందు నాలుగు పరకలువేసి, కాకరపాదులో వేన్నీళ్ళ స్నానం ముగించాడు. ఆ ముసలాయన్ని చూచేటప్పటికి గోపీకి ఆశ్చర్యంవేసింది. అతను తన స్నేహితుడైన శేషాద్రి తండ్రి అంతేగాని తనకుపరిచయస్తుడు కాడు. ఇప్పుడు తనకోసం ఎందుకు వస్తున్నట్టు?

ముసలాయన గడపలో అడుగు పెట్టీ పెడుతూనే, "నేను శేషాద్రి తండ్రినండీ" అన్నాడు.

"అవును మీతో ఎక్కువ పరిచయం లేకపోయినా, మిమ్మల్ని ఇదివరకు చాలా సార్లుచూశాను. శేషాద్రి బాగున్నాడా?" అని అడిగాడు గోపీ.

"వాడి సంగతి చెప్పటానికే వొచ్చానండీ." అని ప్రారంభించాడు. "వాడు ఆస్తంతా అమ్మేస్తానంటున్నాడండీ!"

"ఎందుకు"

"డబ్బు పార్టీ కివ్వటాని కండీ!" అన్నాడు.

"ఏమిటీ!!!?"

"అవునండీ! జపానొస్తుందట! దాన్ని ఆపటానికి పార్టీకి దస్తు కావాలట! తను ఆస్తమ్మి పార్టీకి ఇచ్చి వేస్తాట!"

ఈ మాటలు వింటూ గోపీ నిలిచిపోయాడు. ఒక్కసారి శేషాద్రి పిల్లలు కళ్ళముందు కనిపించారు. ఇంతా ఇంతా, ఇంతా నలుగురు పిల్లలు గాలిగోపురం అంతస్తులకు మల్లే వుంటారు పెద్దపిల్లవాడికి, పప్పు ఎక్కువ తింటంవల్ల మొన్ననే అజీర్తి చేసింది. చిన్నపిల్లని "గెరిల్లా" అని ఆ వూళ్ళో వాళ్ళు హాస్యంగా పిలుస్తుంటారు. వీళ్ళని ఏం చేస్తాడు?

"మీరు ఒకసారి మావూరు రావాలండీ! మీరు చెపితేగాని వాడువినడు. వాడి విషయం నాకేమీ దిగుల్లేదుకాని, ఆ పసికూనలున్నారే" ఈమాటలు చెబుతూ ముసలాయన కంట తడి పెట్టుకునేటప్పటికి గోపీకి వొళ్ళు మండి పోయింది.

"పదండి; వస్తున్నాను" అన్నాడు.

శేషాద్రి తన్ను గురుతుల్యంగా చూసుకుంటాడే, తనమాట వినక ఏంచేస్తాడు? శేషాద్రి చెడిపోతూవుంటేతాను చూస్తూ వూరుకుంటాడా?

*　　*　　*　　*

ఇద్దరూ వూరుజేరగానే, ముందునడుస్తున్న ముసలాయన ఆగి, గోపీతో ఇలా అన్నాడు "మీరు ఈదారిని పదండి. నేను ఇంకొక దారిని వస్తాను. మిమ్మల్ని నేనుతీసుకు వచ్చినట్లు వాడితో అనకండి-అభిమాన పడతాడు." ఈమాట చెప్పి ముసలాయన డొంకదార్ని వూళ్ళోకి బయల్దేరాడు. గోపీ ముసలాయన్ని గురించీ కొడుకుమీద ఆయనకున్న వాత్స ల్యాన్ని గురించీ తలుచుకుంటూ, ఇటువంటి తండ్రి మనస్సుని ఖేద పెడుతున్నందుకు శేషాద్రినిమనస్సులోదూషిస్తూ శేషాద్రిఇంటికి జేరాడు.

అప్పుడు శేషాద్రి పదిమంది కుర్రవాళ్ళని పెట్టుకొని బుర్రకథ రిహార్సల్స్ చేయిస్తున్నాడు. "అదిగదిగో ఫాసిస్టు జపాను వస్తూయున్నది"

అని పాడుతున్నాడు. గోపీని చూచి హఠాత్తుగా ఆపివేసి వచ్చి, మర్యాద చేసి కూర్చొబెట్టి ఫలానా వారొచ్చారని చెప్పటానిక్కామాలు ఇంట్లోకి వెళ్ళాడు. హాల్లో మరొకపక్క పదిమంది ముసలివాళ్ళు బుర్రకథ వింటానిగ్గాను కూర్చొనివున్నారు. వాళ్ళలో ముసలాయన కూడా వుంటం గోపీ చూశాడు. గోపీకి ఆ దృశ్యం రవివర్మ వేసిన కృష్ణరాయభారం చిత్రాన్ని జ్ఞప్తికి తెచ్చింది. ముసలి వాళ్ళంతా తన్ను విచిత్రంగా చూస్తు న్నారు. "మీరువచ్చిన పని మాకు తెలుసులే!" అన్నట్లు మధ్య మధ్య ముసి ముసి నవ్వులు నవ్వుకుంటున్నారు.

ఇంతలో ఒక ముసలాయన గోపీ దగ్గరకు జరిగి 'ఇంత అన్యాయం ఎక్కడైనా వుందా? పిత్రార్జితం పాడుజేసు కుంటారా?' అని ముక్కుమీద వేలు వేసుకున్నాడు.

ఈమాట వినికుర్రవాళ్ళు ఎక్కడివాళ్ళు అక్కడ లేచిపోయారు.

"ఇదంతా ఒక్కటే జట్టండీ! మీరు గట్టిగా చెప్పండి, వినక ఏమవు తాడో చూద్దాం" అన్నాడు ఇంకొకాయన.

"ఇదెక్కడైనా వుందా! ఉపన్యాసాలిచ్చిన వాళ్ళున్నారు జైళ్ళకు రెండు మూడుసార్లు వెళ్ళి వచ్చిన వాళ్ళున్నారు. ఆస్తి అమ్మి పార్టీకివ్వటం ఏనాడైనా విన్నామా?" అన్నాడు ఇంకొక ముసలాయన.

"పసికూనలున్నారు" అని కంటతడి పెట్టుకున్నాడు శేషాద్రి తండ్రి.

"ఊరుకోండి, పరవాలేదు." అని ధైర్యం చెప్పాడు గోపీ.

"అదే మాధైర్యం!" అన్నారు అంతా ఏకగ్రీవంగా. శేషాద్రితండ్రి కంటతడి తుడుచుకున్నాడు.

* * *

అవ్వాళ రాత్రి భోజనాలదగ్గర, శేషాద్రి భార్య అన్నం వొడ్డించే సందర్భంలో, గోపీ ఈవిషయం కదిలించాడు.

"ఏం శేషాద్రీ, ఏమిటి సంగతులు?"

"ఏమున్నాయండీ...."

"పిల్లజల్లా అంతా బాగున్నారా?"

"ఆహా!...."

"ఏముందండీ? ఇకనుంచి పూర్తిగా పార్టీపనిలోకి దిగుదాం అనుకుంటున్నాను."

"నీవేం చేస్తున్నావ్."

"నేనూ విన్నాను ఆస్తంతా పార్టీకి ఇచ్చేస్తున్నావటగా"

"ఇచ్చివెయ్యటం ఏమిటిలెండి! ఏదో పార్టీకి నాకు చేతనైనా సహాయం చేద్దాం అనుకుంటున్నాను."

గోపీ మాట్లాడలేదు. శేషాద్రి భార్య పులుసువొడ్డిస్తూ వుంటే కలుపుకుంటూ కూర్చున్నాడు. శేషాద్రి మాట్లాడలేదు. "ఈ పొలం, ఆస్తీ వుంది చూచారా మహాచెడ్డది. ఒక్కపని చెయ్యనియ్యదుగదా! మొన్న కవులు కివ్వగా మిగిలిన ఎకరంలో కందివేశాను. ఇప్పుడా ఎకరం అమ్మినా, నేను పెంచిన కంది మినహాయించాలని అనిపిస్తావుంది."

గోపీకి తన కాకరపాదూ, పొట్లతీగా, గేదా జ్ఞాపకం వొచ్చాయి. ఎక్కడికివెళ్ళినా క్షణంక్షణం ఇవి జ్ఞాపకంరావటం, ఏమైనయ్యో తీగెలు ఏవి పీకినయ్యో, గేదెకి గడ్డివేశారో లేదో అనిపించడం జ్ఞాపకం వచ్చింది.

శేషాద్రి చెప్పుతూనే వున్నాడు– "ఈ పొలం ప్రజల్ని ఇంత రియాక్షనరీగా తయారుచేస్తుంది. కాబట్టే రైతులు సోషలిజాలికి అంతగా ఎదురు తిరుగుతున్నారు. అందుకనే మహానాయకులంతా టౌన్తో ఎక్కువ సంబంధం పెట్టుకోవలసిందని రైతులకు ఉద్బోధిస్తుంటారు." అన్నాడు.

"మరి నీ తండ్రి ఇలాగే అనుకొని నీకీ ఆస్తి ఇవ్వకపోతే ఏం చేసేవాడివి?" అని అడిగాడు గోపీ.

"చిక్కు ఉండేదికాదు. విప్లవసమరంలో ముందుండేవాణ్ని.ఇప్పుడు ఎలాగూ ఆస్తి అనేది ఒకటి ఉండటం తటస్థించింది. గనక సద్వినియోగం చేద్దాంఅనుకుంటున్నాను."

శేషాద్రి భార్య మజ్జిగ తీసుకురావటానికి ఇంట్లోకి వెళ్ళటం చూచి గోపీ ఇలా అన్నాడు. "నీ భార్యాపిల్లల సంగతి ఏమాలోచించావ్? ఆస్తి వుండి చదువూ సంధ్యా నేర్చుకోబట్టేగా నువ్వింతటి వాడవయ్యావు. ఆ అవకాశం వాళ్ళకి ఇవ్వటం నీ బాధ్యత కాదు?"

విప్లవం జయిస్తే చిక్కేలేదు. లేకపోతే వీళ్ళంతాకూడా విప్లవ సైన్యంలో జేరతారు. దానికి ఆస్తెందుకు? ఆస్తి అడ్డంకూడా! ఆస్తి వుండబట్టే నేనీ స్థితికి రావటానికి ఇన్నేళ్ళు పట్టింది. అదే లేకపోతే అవసరమే వాళ్ళని తయారుచేస్తుంది." అన్నాడు శేషాద్రి.

ఈమాటలు విన్న శేషాద్రి భార్య– "పిల్లలదేముంది లెండి అనుభవం లేకుండా చేసి, ఆస్థి ఇస్తేమాత్రం వుంచుకుంటారా యేమిటి? ఎన్ని చూట్టంలేదు." అంది.

గోపీ తికమకపడ్డాడు.

లోపల ఆడుకుంటూవున్న సుద్దపప్పుతిని అజీర్తిచేసుకున్న శేషాద్రి పెద్దకొడుకు, "విప్లవం వర్ధిల్లుకాక" అని కేక వేశాడు. ఆ కేక విని గెరిల్లా పిల్ల "జపాను నశించాలి" అని ఖంగున మోగింది.

గోపీ ఒక్క నిట్టూర్పు విడిచి అన్నం దగ్గర్నుంచి లేచాడు.

* * * *

తెల్లవారి శేషాద్రి తండ్రివచ్చి చూసేటప్పటికి గోపీలేడు. ముసలి వాళ్ళంతా ఒక్కచోట జేరి గుంపు చింపులు పడ్డారు. శేషాద్రిమాత్రం యథాప్రకారం కుర్రవాళ్ళని పోగుజేసి బుర్రకథ రిహార్సల్ మొదలు పెట్టాడు.

"అదిగదిగో ఫాసిస్టు జపాన్ వొస్తూయున్నాదీ.

)o....o(